క్లుప్తంగా

సెలూన్స్‌కు ట్రేడ్ లైసెన్సు రద్దు చేయాలి

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో సెలూన్స్‌కు ట్రేడ్ లైసెన్సు రద్దు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘ నేతలు మున్సిపాలిటీ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం నాయీబ్రాహ్మణ సంఘ నేతలు మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలుగు నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు మాట్లాడుతూ చిన్న చిన్న షాపులకు ట్రేడ్ లైసెన్సు వేయటం వలన ఆర్థిక భారం అవుతుందన్నారు. నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వణుకూరు మారుతీ సురేష్‌బాబు, తెన్నేటి ప్రకాష్, ఎస్.రాజు, పరస బాలకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం

ఉయ్యూరు రూరల్: ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పెద్ద ఓగిరాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫరేషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో యూనియన్ బ్యాంక్ పెద్ద ఓగిరాల బ్రాంచ్ మేనేజర్ చైతన్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పట్ల తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని, బ్యాంకు ఖాతాలు తెరిచి పొదుపు చేయాలని ఆమె కోరారు. 'నేటి పొదుపు రేపు రక్షణ' కలిగిస్తుందన్నారు. వెలుగు ఏపీఎం అమరేశ్వర్, కౌన్సిలర్ కైలే సునీల్, పెదవగిరాల వెలుగు సీసీ, ఏఎస్‌ఎం, కౌన్సిలర్ టీ హేమారావు తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ముద్రించిన కరపత్రాలను యూనియన్ బ్యాంక్ మేనేజర్ చైతన్య చేతుల మీదుగా ఆవిష్కరించి అందజేశారు.

సాక్షి ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ధర్మ మహేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వర్ధమాన సినీహీరో ధర్మ మహేష్‌కు ప్రతిష్టాత్మక సాక్షి ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'డ్రింకర్ సాయి' చిత్రంలో హీరోగా నటించిన ధర్మ మహేష్ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. 'బెస్ట్ డెబ్యూ యాక్టర్ ఆఫ్ ది ఇయర్- 2024'గా సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్‌కు ధర్మ మహేష్ ఎంపికయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి సాక్షి ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవంలో అతిథుల చేతుల మీదుగా ధర్మ మహేష్ ఈ అవార్డును స్వీకరించారు. ధర్మ మహేష్ తండ్రి కాకాని వెంకటేశ్వరరావు (బాబు) స్థానిక కేఎస్ టాకీస్ థియేటర్ యాజమానిగా, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీగా సుపరిచితులు. తల్లి కాకాని అరుణ. ధర్మ మహేష్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఉయ్యూరు రూరల్: మండలంలో ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉయ్యూరు పట్టణం, మరో 5 కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్నాయని కృష్ణ జిల్లా ఆర్ఐఓ సాల్మన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల, ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల, నారాయణ, చైతన్య, శ్రీ విశ్వశాంతి కళాశాలలోనూ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల నుంచి 24,401 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు పంపిణీ ప్రక్రియ సాగుతోందని వివరించారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

పెనమలూరు: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని కానూరు వీఆర్‌సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ డైరెక్టర్ బావినేని పాండురంగారావు అన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్తకొత్త ఆవిష్కరణలు చేసి ప్రతిభను చాటాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు 10 మోడల్స్ రూపొందించి అబ్బురిపరిచారు. 9వ తరగతి విద్యార్థి ప్రణీత్‌కుమార్ రూపొందించిన యాంటీ సూసైడ్ ఫ్యాన్, 7వ తరగతి విద్యార్థులు షేక్ అఫ్రిన్, ఝాన్సీ, చిట్టిప్రియ రూపొందించిన హైడ్రాలిక్ రోడ్డుపై ప్రాజెక్టు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.వెంకటేశ్వరరావు, సిద్ధార్థ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.రవిచంద్ర, కొల్లా నరేంద్ర, డాక్టర్ కవిత, ఉపాధ్యాయులు మాగంటి శ్రీనివాసరావు, శాంతిశ్రీ, సుధాకర్ బాబు, వి.మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ప్రవంతి హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల సైన్స్ పరిశోధన నమూనాలను ప్రదర్శించారు. తొలుత సైన్స్ ఎగ్జిబిషన్‌ను జిల్లా సైన్స్ ప్రాజెక్ట్ కార్యదర్శి మాణిక్యాలరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీవీ రామన్ తన సైన్స్ పరిశోధనల ద్వారా ప్రపంచాన్ని ఆకర్షించడంతో పాటు 1930లో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1954లో భారతరత్న పురస్కారంతో సత్కారించినట్లు తెలిపారు. రామన్ పరిశోధన ఫలితాన్ని ధ్రువపరిచిన రోజునే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి సీవీ. రామన్‌ను ఆదర్శంగా తీసుకుని రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకిపాడు: జాతీయ సైన్స్ దినోత్సవం ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్‌లో శుక్రవారం ఉత్సాహంగా సాగింది. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విద్యాసంస్థల సీఏసీ సుధారాణి, జువాలజీ లెక్చరర్ వి.సత్యనారాయణ, విద్యాసంస్థ ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మితో కలిసి ప్రారంభించారు. విండ్ పవర్ మొబైల్ చార్జర్, శాటిలైట్ ఫ్యాన్స్, సోలార్ సిస్టమ్, ఫార్మర్ హెల్పర్, హైడ్రాలిక్ లిఫ్టింగ్, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, డ్రోన్‌లను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. తొలుత ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఏసీ సుధారాణి, ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి మాట్లాడుతూ ఆలోచనలకు పదును పెడితేనే ఉజ్వల భవిత ఉంటుందన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మడిచర్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీహరి నేతృత్వంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. తొలుత సర్ సి.వి.రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సి.వి.రామన్ జీవిత విశేషాలను, శాస్త్రీయ పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన ద్రావణాలు, గాలి పీడనం, కంపోస్ట్ మేకర్, ట్రాఫిక్ సిగ్నల్స్, పౌష్టికాహారం వంటి ప్రాజెక్టులు గ్రామస్తులను ఆకట్టుకున్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ తిలకించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి ఆ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు: జాతీయ సైన్స్ డేను పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు. నారాయణ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు సుధీర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ నూకల వంశీ పాల్గొని విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ తోట జ్యోతి పర్యవేక్షించారు.



తాడిగడపలో విద్యార్థులు రూపొందించిన మోడల్స్‌తో ఉపాధ్యాయులు



ఈడుపుగల్లులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం


గన్నవరంలో సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న మాణిక్యాలరావు, రామకృష్ణ


బాపులపాడు జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్

టైలర్లను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని టైలర్లకు ప్రతి నెలా ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారని మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి పేర్కొన్నారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం నున్న గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ టైలర్ బొడ్డు కోటేశ్వరరావును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టైలర్లు (దర్జీలు) నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని నాగిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నున్న గ్రామ ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పార్టీ నాయకులు భీమవరపు ముత్తారెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రపంచ టైలర్స్ డే వేడుకలను నిర్వహించారు. పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుట్టుమిషన్‌ను సృష్టించిన విలియమ్స్ ప్రపంచ వ్యాప్తంగా కొట్లాది మందికి ఉపాధి కల్పించారని టైలర్స్ సంఘ నేతలు పేర్కొన్నారు. అసోసియేషన్‌లోని టైలర్స్ అందరూ ఐక్యమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. గన్నవరం పరిసర ప్రాంతాలకు చెందిన టైలర్స్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో ప్రపంచ టైలర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీహనుమాన్ టైలర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కూడలిలో కుట్టుమిషన్ రూపకర్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, టైలర్స్ యూనియన్ జెండాను ఎగుర వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ దర్జీల సంక్షేమానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం టైలర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతామహలక్ష్మి నర్సింగ్ హోంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఎంపీ అక్బర్ షరీఫ్, రెడ్డి నరసింహారావు, తాడి శ్రీనివాసరావు, కొమ్మూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.


టైలర్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


విలియమ్స్ హోవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్స్

సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థినులు

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థినులు గ్రామంలో సచివాలయ, రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఒకేషనల్ ఇండస్ట్రియల్ శిక్షణలో భాగంగా విద్యార్థులు రైతు సేవా కేంద్రం నుంచి రైతులకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల సేవలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో అధికారుల నుంచి సేకరించారు. హెచ్‌ఎం.వై.దుర్గాభవాని, అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనర్ ఎం.సింధు, వీఏఏలు అనురాధ, అహల్య, విద్యార్థినులు పాల్గొన్నారు.



అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

కంకిపాడు: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు అన్నారు. ప్రొద్దుటూరు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలు పి.జయమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పెన్షన్ బెన్ఫిట్ మంజూరు ఉత్తర్వులను జయమ్మకు అందించి సత్కరించారు. ఇమ్మానుయేలు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో అంకిత భావంతో పనిచేయాలన్నారు. సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఏ.శ్రీనివాసమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పి.సురేష్‌బాబు, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యురాలు శ్రీలత, ప్రతినిధులు ఎస్.జ్యోతి, ఎస్.విజయకుమారి పాల్గొన్నారు.

పెనమలూరు: ఉపాధ్యాయులు ఉత్తమ సేవలు అందించి సమాజానికి బాధ్యత కలిగిన పౌరులను అందించాలని పారిశ్రామికవేత్త, కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్వీనర్ అన్నే శివనాగేశ్వరరావు అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 39 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా సేవలు అందించిన అడుసుమిల్లి జయలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు పాండురంగప్రసాద్, కె.రెడ్డమ్మ, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు బి.అజరయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న శివనాగేశ్వరరావు

రామలింగేశ్వరుని సన్నిధిలో వసంతోత్సవం

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో శుక్రవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకుని సందడి చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా కృష్ణాదిలోకి తీసుకు వెళ్లారు. అక్కడ స్వామివారికి త్రిశూల స్నానం చేశారు. అనంతరం స్వామి వార్లకు కల్యాణం చేసిన దంపతులు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మలు స్వామివారి ఉత్సవ విగ్రహాలను కృష్ణానది ఒడ్డున ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివార్లను కొండ పైకి తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం దాదాపు 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

స్వామివారికి పవళింపు సేవ..

రాత్రికి కొండపై రామలింగేశ్వర స్వామికి పవళింపు సేవ చేశారు. తొలుత ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, సంకీర్తన చేశారు. స్వామివారికి నివేదన చేసిన భక్తులకు నందిముద్దలు ఇచ్చారు. నందిముద్దలు గ్రహించిన వారు సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

పెనమలూరు: గోసాలకు చెందిన శ్రీవెంకటేశ్వర యోగా సేవ కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీ నుంచి పెనమలూరులో ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నామని బోధన యోగాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ.. శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి ప్రతి రోజూ యోగా శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 91333 06804 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కబడ్డీ లీగ్ విజేతలకు బహుమతులు

ఉయ్యూరు రూరల్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కబడ్డీ లీగ్ గండిగుంటలో ఉత్సాహంగా ముగిశాయి. కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు శుక్రవారం అందజేశారు. గండిగుంట అంబేడ్కర్ యూత్ మొదటి స్థానం బహుమతిగా రూ.20 వేలు కైవసం చేసుకోగా, రెండో స్థానంలో కపిలేశ్వరపురం టీం, మూడో స్థానంలో మేడూరు, నాలుగో స్థానం కనుమూరు టీంలు బహుమతులు అందుకున్నారు. కమిటీ తరపున షీల్డ్, నగదు బహుమతిని అందజేసినట్లు ఎంపీటీసీ సభ్యుడు గుండె పోతురాజు, నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కబడ్డీ లీగ్ పోటీల నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్దలకు ప్రజలకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

దంపతులను గాయపర్చిన వ్యక్తిపై కేసు

నున్న(విజయవాడరూరల్): రాడ్‌తో భార్యాభర్తలను గాయపర్చిన వ్యక్తిపై నున్న పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాపీ పని చేసే షేక్ బాషా, భార్యాపిల్లలతో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి వచ్చి నున్న గ్రామంలో రేడియంట్ స్కూల్ వద్ద అద్దెకు ఉంటున్నాడు. అదే ఇంట్లో రెండవ ఫోర్షన్లో అద్దెకు ఉంటున్న అన్నపురెడ్డి నాగరాజు బాషా ఇల్లు కడిగిన నీరు తన ఇంటి వైపు వస్తున్నాయని బాషాను, అతని భార్యను రాడ్‌తో గాయపర్చగా, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. షేక్ బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకి సాలిపేట ప్రాంతంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రోడ్డుపై కనబడిన ప్రతి ఒక్కరిపై దాడి చేసింది. ఏకంగా 18 మందిని కరిచింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కుక్కకాటుకు గురైన బాధితులు పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావటంతో వైద్యుడు బిజిలీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాయపడిన వారికి టీటీ ఇంజెక్షన్, ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేశారు. కాగా పోరంకిలో ఇటీవల కాలంలో కుక్కలు వీధుల్లో పెద్ద సంఖ్యలో తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం

ఉయ్యూరు: విద్యాభివృద్ధికి రోటరీ ఎప్పుడూ ముందుంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రమణ్యం అన్నారు. శ్రీ శ్రీనివాసా కళాశాల విద్యార్థిని నోహితకు రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. కార్యక్రమంలో కేసీపీ డీజీఎం వెంకటేశ్వర్లు, రోటరీ ప్రతినిధులు అమీర్ మీర్జా, ఎస్.అమర్‌నాథ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడ రూరల్): పాయకాపురం విద్యుత్‌సబ్ స్టేషన్ రాధాన గర్లోని 11 కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాధానగర్, బర్మా కాలనీ, ప్రజాశక్తి నగర్, సుందరయ్య నగర్, ఎస్.జె కిడ్స్ స్కూల్ రోడ్, బిందెల కంపెనీ రోడ్, డాక్టర్స్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ తెలియచేశారు.